విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

జ్యూస్ ఫ్యాక్టరీలు...

రూ.8 రూపాయలు చెల్లించాల్సిందే

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు డిమాండ్

కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన మామిడి రైతులు

యాజమానులతో చర్చలు జరుపుతామని కలెక్టర్ హామీ

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట మామిడి రైతులు నిరసన

విశాలాంధ్ర -చిత్తూరు: మామిడి రైతులకు ప్రభుత్వం ఆదేశం మేరకు పరిశ్రమలు ఇవ్వాల్సిన ఎనిమిది రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులు సోమవారంచలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేదని పోలీసులు కాంక్షలు పెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి భారీగా రైతులు తరలివచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు జిల్లామామిడి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మునీశ్వర్ రెడ్డి ,మురళిలు మాట్లాడుతూ మామిడి పరిశ్రమలు ప్రభుత్వ ఆదేశానుసారం రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలకు మామిడి కాయలుతోలి ఏడు నెలలు కావస్తున్న రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమని మళ్లీ మామిడి సీజన్ కు పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఆసన్నమైనదని బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను మోసం చేసే 40 పరిశ్రమలవైపా, లేక 40 వేల మామిడి రైతుల పక్షమా అన్నది తేల్చుకోవాలని ప్రశ్నించారు .మామిడి రైతులకు పరిశ్రమలు చెల్లించాల్సిన బకాయిలు కూడా రైతుల ఖాతాలో వేయాలని, వచ్చే సంవత్సరం మే నెలలోనే గుజ్జు పరిశ్రమలు ప్రారంభం చేయాలని ,టేబుల్ రకాలు కాయలను రైతులు నేరుగా అమ్ముకోవడానికి పట్టణాల్లో ప్రత్యేక సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని. మామిడి అనుబంధ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, రైతులకుకోల్డ్ స్టోరేజీలు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని , మామిడి పంట సాగుకకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. గతంలో అనేకమార్లు కలెక్టర్ తో చర్చలు జరిపినా మామిడి రైతుల సమస్యలు పరిష్కరించకపో వడం దుర్మార్గమని మామిడి రైతులక న్నీరు రాష్ట్రానికి మంచిది కాదని మామిడి రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పంచాయతీ ఎన్నికలలో రైతులే ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెపుతారని హెచ్చరించారు. జిల్లా సిపి ఎం కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల వద్ద నిల్వ ఉన్న మామిడి గుజ్జును తిరుమల తిరుపతి దేవస్థానానికి మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.మామిడి రైతు సంఘం. జిల్లా ఉపాధ్యక్షులు హేమలత మాట్లాడుతూ మామిడి రైతులు శాంతియుతంగా సమావేశం నడుపుకుంటుంటే నిర్బంధాలు చేయడం మైకును పెట్టకుండా అడ్డుకోవడం మామిడి రైతులను చులకనగా మాట్లాడడం దుర్మార్గమైన చర్యగా భావించాల్సి ఉంటుందని రైతులపై అభాండాలు వేయకుండా రైతుల సమస్యలను రాజకీయాలకతీతంగా పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు నాగరాజు మాట్లాడుతూజిల్లాలోని మామిడి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబుల్ రాజు,జానపద వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షులు కేఎస్ రామచంద్రన్, ప్రధాన కార్యదర్శి రవి. వివిధ ప్రజా సంఘాలు మామిడి రైతులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే. సురేంద్రన్, సంజీవరెడ్డి, మునిరత్నం నాయుడు, ఉమాపతి నాయుడు,సందీప్, మోహన్ రెడ్డి,త్యాగరాజు రెడ్డి,భారతమ్మ,చెంగల్ రాయరెడ్డి, జయదేవయ్య, బెల్లంకొండ శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు. అనంతరం చిత్తూరు జిల్లా కలెక్టర్ సునీల్ కుమార్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సాధ్యమైనంత తొందరగా మామిడి రైతుల సమస్యలపై గుజ్జు పరిశ్రమలతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా రైతులు తరలివచ్చారు.

అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి పాల్గొని అర్జీదారుల నుంచి స్వయంగా దరఖాస్తులు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించి సంబంధిత శాఖల సమన్వయంతో త్వరి తగతిన పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి నర సింహులు తదితర అధికారులతో కలిసి వేదికలో ఏర్పాటు చేసిన కౌంట ర్లను మంత్రి పరిశీలించారు. స్వీకరించిన అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, దరఖా స్తులను తప్పులేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచిం చారు. అలా చేయడం వల్ల ప్రజా సమస్యల పరిష్కారం మరింత వేగవంతంగా జరుగుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

పుత్తూరులో సబ్ జైలు నిర్మాణానికి హెూం మంత్రి హామీ

విశాలాంధ్ర - పుత్తూరు: పుత్తూరు పట్టణంలో సబ్ జైలు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటానని రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత గారు హామీ ఇచ్చినట్టు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు తెలిపారు. దీనికి సంబంధించి హెూం మంత్రికి వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. పుత్తూరులో సబ్ జైలు నిర్మాణ విషయమై చర్యలు చేపట్టాలని కోరగా అప్పటికప్పుడే జైలు అధికారులకు ఫోన్ చేసి హెూమ్ మంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా విజయ్ బాబు మాట్లాడుతూ పుత్తూరు పట్టణ శివారులో అధు నాతనంగా జైలు నిర్మించేందుకు 2011లో అప్పటి ప్రభుత్వం నందిమంగళం రెవిన్యూ లెక్క దాఖలలోని ఎన్జీవో కాలనీ వద్ద జైలు నూతన జైలు భవన నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించిందని తెలిపారు. సుమారు 5 కోట్ల రూపాయలు బడ్జెట్ తో నిర్మాణం ప్రారంభించాలనుకున్నారని అయితే ప్రారంభ దశలోనే నిర్మాణం నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం పుత్తూరులో జైలు లేనందున ముద్దాయిలను 70 కిలోమీటర్ల దూరంలోని సత్యవేదు లేదా శ్రీకాళహస్తి జైళ్లకు తీసుకెళ్తున్నారని, ఖైదీల బంధువులకు పోలీస్ సిబ్బందికి దీని వల్ల చాలా ఇబ్బంది ఎదురవుతోందని పేర్కొన్నారు. నగిరిలో ఒకటి, పుత్తూరులో మూడు కోర్టులు ఉన్నందున పుత్తూరు పట్టణంలో కేటాయించిన స్థలంలో జైలు నూతన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హెూం మంత్రిని కోరినట్లు వివరించారు ఆయన పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకానికి

పేరును పునరుద్ధరించకపోతే భారత జాతి క్షమించదు

- సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు

విశాలాంధ్ర -చిత్తూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మార్పు చేయడానికి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ భారతదేశంలో అనేక వర్గాల ప్రజా సమస్యలతో కొట్టు మిట్టాడుతున్న తున్న ప్రజా సమస్యలను పరిష్కరించగా పొగా సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపలేని ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి విబి జి రాంజీ పేరును బట్టి మహాత్మా గాంధీని అవమానపరచడమేనని వాపోయారు .భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ఉద్యమంలో బ్రిటిష్ వారితో పోరాటం చేసి ప్రజలతో మమేకమై జాతిపిత అనే బిరుదుని సాధించిన మహాత్మా గాంధీ పేరును మార్చి వి. బి. జి. రాంజీ అనే పేరు పెట్టడం దుర్మార్గపు చర్యని తీవ్రంగా ఖండించారు కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పునరుద్ధరించకపోతే ప్రజలే గుణపాఠం చేపతారని హెచ్చరించారు . ఈనిరసన కార్యక్రమం సిపిఐ నాయకులు గోపీనాథ్, మణి, దాసరి చంద్ర, విజయగౌరీ, జామి లాటీ, రమాదేవి, కుమారి, గుర్రప్ప,బాలాజిరావు, రఘు, లతారెడ్డి, ఫైరోజ్ ప్రియా, గజేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విద్యుత్ శాఖలో..

ఉద్యోగాల భర్తీ

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర-పాకాల: రాష్ట్రంలో త్వరలోనే విద్యుత్ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికు మార్ తెలిపారు. సోమవారం పాకాల మండలంలోని మొగరాలలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సబ్‌స్టేషన్ ప్రారంభో త్సవ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని చంద్రగిరి, పూతలపట్టు శాసనసభ్యులు పులివర్తి నాని, మురళిమోహన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తులో సమస్యలు పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగానే విద్యుత్ సిబ్బంది కొరత లేకుండా త్వరలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గత వైసీపీ హయాంలో అనాలోచితంగా అధిక ధరలకు విద్యుత్తును కొనుగోలు చేసి ఆభారాన్ని ప్రజల నెత్తిన రుద్దారని, విపరీతంగా కరెంటు చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులపాలు చేశారన్నారు. ముఖ్యంత్రి చొరవతో ఆ లోపాన్ని చక్కదిద్ది కొంతమేరకు కరెంటు చార్జీలు తగ్గిచామని భవిష్యత్తులో మరింత తగ్గిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకొని తమ ఇళ్ల వద్దే కరెంటు ఉత్పత్తిని చేసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు,ప్రభుత్వఅధికారులు,కూటమినాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు

తిరుమల లోకల్ టాక్సీ డ్రైవర్లతో అవగాహన

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమలలో ఆస్థాన మండపంలో వైకుంఠ ఏకాదశికి సంబంధించి పోలీస్, ఆర్టీవో, విజిలెన్స్,అధికారులు సంయుక్తంగా లోకల్ టాక్సీ డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యంగా టాక్సీ డ్రైవర్లు 28వ తారీకు రాత్రి నుండి వారి వాహనాలను తిరు మల లోని పార్కింగ్ ప్లేస్‌లో ఉంచకుండా తీసివేయాలని మరి యు వైకుంఠ ఏకాదశి ద్వాదశి జనవరి ఫస్ట్ వరకు వి.వి.ఐ.పి మరియు అత్యవసర వాహనాలకు ఇబ్బంది కలిగించకుండా వాహనాలను ఇన్నర్ రింగ్ రోడ్లోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్ లోనే తిప్పాలని వీలైనంతవరకు టికెట్ ఉన్న భక్తులను మాత్రమే పైకి తీసుకురావాలని మరి యు ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తిరుమల టాక్సీ డ్రైవర్లకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్టీవో మురళీమోహన్, ఎం వి ఐ శ్రీనివాసులు, ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, టూ టౌన్ సిఐ శ్రీరాముడు, విజిలెన్స్ ఏవీఎస్ఓ కృష్ణరాజ్ పాల్గొన్నారు.

షార్ నుండి 24న..

బాహుబలి రాకెట్ ప్రయోగం

- ఉదయం 8.54 నిమిషాలకు రాకెట్ ప్రయోగం
- ఎల్ వీఎం3ఎం6 బ్లూబర్డ్ బ్లాక్ 2 ఉపగ్రహం నింగిలోకి

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి ఈనెల 24వ తేదీ ఎల్వీఎం 3 ఎం 6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూ బార్డ్ బ్లాక్ టు ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు నింగిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి ఇస్రో చైర్మన్ నారాయణ శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలంలోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం-3ఎం6 రాకెట్ ద్వారా బ్లూబ బ్లాక్ 2 వాణిజ్య ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. సుమారు 6,500 కిలోగ్రాముల బరువుతో ఇది ఇప్పటివరకు భారత్ ప్రయోగిం చనున్న అత్యంత భారీ వాణిజ్య ఉపగ్రహం. అమెరికాకు చెందిన ఏఎస్ స్పేస్ మొబైల్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహాన్ని భూమికి సుమారు 520 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్లోకి ఖచ్చితంగా ప్రవేశపెట్టే బాధ్యతను ఇస్రో శక్తివంతమైన ఎల్వీఎం-3 రాకెట్ నిర్వహిస్తుంది. కక్ష్యలో చేరిన వెంటనే 223 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించే ఫేజ్డ్ అరే యాంటెన్నాతో, ఇది లో ఎర్త్ ఆర్బిట్లోనే అతిపెద్ద వాణిజ్య కమ్యూనికేషన్ యాంటెన్నాగా రికార్డు సృష్టిస్తుంది. సాధారణ మొబైల్ ఫోన్లకే నేరుగా 4జీ - 5జీ సేవలు అందించేలా రూపొందించబడిన ఈ ఉపగ్రహానికి ప్రత్యేక యాంటెన్నాలు లేదా అదనపు పరికరాలు అవసరం లేదు. హిమాలయాల వంటి పర్వత ప్రాంతాలు, విస్తార మైన ఎడారులు, లోతైన సముద్రాలు, గ్రామీణ ప్రాంతాలు, విమాన మార్గాలు వంటి చోట్ల కూడా మొబైల్ కనెక్టివిటీని అందించడం దీని ప్రధాన లక్ష్యం. సెకనుకు గరిష్టంగా 120 మెగాబిట్ల వేగంతో డేటా ప్రసారం చేయగల సామర్థ్యం కలిగిన ఈ ఉపగ్రహం 5,600కి పైగా సిగ్నల్ సెల్స్ ద్వారా విస్తృత కవరేజ్ అందిస్తుంది. ఈ ప్రయోగం ఎల్వీఎం-3 రాకెట్కు ఆరవ కార్యాచరణ మిషన్ కాగా, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడవ పూర్తిస్థాయి వాణిజ్య ప్రయోగంగా నిలవనుంది. 43.5 మీటర్ల ఎత్తు, 640 టన్నుల బరువు ఉన్న ఎలివిఎం-3 రాకెట్ లోని రెండు ఘన ఇంధనకమ్యూనికేషన్ యుగం ప్రారంభం బూస్టర్లు, ద్రవ ఇంధన కోర్ దశ, శక్తివంతమైన క్రయోజెనిక్ ఎగువ దశ సమన్వయంగా పనిచేసి ఈ భారీ ఉపగ్రహాన్ని ఖచ్చిత కక్ష్యలో నిలుపుతాయి. ఇది ఇస్రోకు 100వ ప్రయోగం కాగా, 2025లో ఐదవ ప్రయోగంగా నమోదు అవుతుంది. చంద్రయాన్ 3, వన్ వెబ్ వంటి విజయవంతమైన మిషన్లతో ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత సంపాదించిన ఇస్రోకు ఈ ప్రయోగం వాణిజ్య అంతరిక్ష రంగంలో మరింత బలం చేకూర్చనుండగా, మారుమూల ప్రాంతాలకు మొబైల్ సేవలను అందిస్తూ ప్రపంచ డిజిటల్ అంతరాన్ని తగ్గించే దిశగా బ్లూబర్డ్ బ్లాక్ 2 మిషన్ భవిష్యత్ కమ్యూనికేషన్ వ్యవస్థలకు దిశానిర్దేశం చేస్తుందని అంతరిక్ష నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రయోగం విజయవంతం అయితే ఇస్రో సెంచరీ పూర్తి చేసుకుటుంది.

ట్రైనీలు తమ శిక్షణను నిబద్ధతతో పూర్తిచేయాలి : ఎస్పీ

విశాలాంధ్ర -చిత్తూరు: పోలీసులు ఉద్యోగాలకు ఎంపికైన ట్రైనీలు తమ శిక్షణను నిబద్ధతతో పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. సోమవారం స్టైపెండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు నేటి నుండి 9 నెలల శిక్షణ చిత్తూరు పట్టణములోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లోప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యతతో కూడిన సేవా భావమని తెలిపారు. ప్రారం భమైన ఈ 9 నెలల శిక్షణ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులు, మారుతున్న నేర ధోరణులు ఆధునిక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని డీజీపీ కార్యాలయం నుంచి తాజా అంశాలతో కూడిన శిక్షణ ప్రణాళికలు అనుగుణంగా ట్రైనీలకు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో క్రమశిక్షణ, సమయ పాలన, నిబద్ధత అత్యంత ముఖ్యమని, శిక్షణను పూర్తిగా వినియోగించుకుని ప్రతి ఒక్కరూ ఉత్తమ పోలీస్ కానిస్టే బుల్‌గా ఎదగాలని సూచించారు. పోలీస్ విధుల్లో శారీరకంగా, మానసికంగా పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉండటం అత్యవసరమని అన్నారు. అలాగే జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో అవుట్‌డోర్ ఇండోర్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇప్పటికే జారీ చేశామని, ప్రతి ట్రైనీకి నాణ్యమైన శిక్షణ అందేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బ్యాచ్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బ్యాచ్‌గా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి సాక్షిగా జన'సేన' గొడవ

- ఆలయ పరిపాలన భవనం వద్ద తోపులాట



విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి సాక్షిగా జనసేన కార్యకర్తలు గొడవ పడ్డారు. ఆలయ పరిపాలన భవనం వద్ద జనసేన కార్యకర్తలు వర్గాలుగా విడిపోయి తోచులాడుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఇలా గొడవ పడటంతో... అక్కడే ఉన్న ఉద్యోగులు వారిని సముదాయించి పంపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి... శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం కోసం సోమవారం శ్రీకాళహస్తికి విచ్చేశారు. స్థానిక జనసేన నేతలు, కార్యకర్తలు ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆ తరువాత రామ్ తాళ్లూరి ఆలయ పరిపాలన భవనంలోని ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొట్టే సాయిప్రసాద్ చాంబరుకు వెళ్లారు. ఆ సమయంలో ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ అందుబాటులో లేరు. రామ్ తాళ్లూరి వెంట కొట్టే సాయి ప్రసాద్ వర్గం... పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి సోదరుల వర్గంతో పాటు వినుత కోట వర్గానికి చెందిన వారు ఉన్నారు. అంతకు మునుపు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఈయనకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అంజూరు చక్రధర్ వెళ్లిపోయారు. కాగా ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఛాంబరులో జనసేన కార్యకర్తలతో రామ్ తాళ్లూరి కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలు పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. రామ్ తాళ్లూరి వీరి ఫిర్యాదులపై అధిష్టానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ తరువాత జనసేన కార్యకర్తలు ఆలయ పరిపాలన భవనం కిందకు వచ్చారు. పరస్పర ఫిర్యాదులపై వీరి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఒకరికి ఒకరు తోచులాడుకున్నారు. ఇది గమనించిన ఆలయ ఉద్యోగులు వెంటనే జోక్యం చేసుకుని వారిని అక్కడ నుంచి పంపేశారు. అధికార కూటమిలో ఉన్న జనసేన కార్యకర్తలు ఆలయ ప్రాంగణంలో ఇలా గొడవ పడటం చర్చనీయాంశంగా మారింది.

తిరుప్పావై పాశురాల పారాయణం ప్రాశస్త్యం

ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం - ఏకాంతంగా అర్చన, తోమాల సేవలు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16వ తేదీన మధ్యాహ్నం 1.23 గంటలకు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో డిసెంబరు 17వ తేదీ ఉదయం నుండి స్వామివారికి సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై పాశుర పారాయణాన్ని నివేదిస్తున్నారు. జనవరి 14వ తేది వరకు తిరుప్పావై సేవ కొనసాగనుంది.

ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం: ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలు కలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష ప్రసాదాలను నివేదిస్తారు. పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి ఒకటిన్నర గంట ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహా విష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. కావున ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

ఆండాళ్ తిరుప్పావై పారాయణం ప్రాశస్త్యం: 12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరు. ఈమెను నాచి యార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామివారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరు ప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారా యణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

ఏకాంతంగా తోమాల, అర్చన, అర్జిత సేవలు: ధనుర్మాసం సందర్భంగా శ్రీవారి ఆలయంలో నిర్వహించే తోమాల, అర్చన సేవలను కూడా ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా జనవరి 14వ తేది వరకు తోమాల, అర్చన సేవలకు భక్తులను అనుమతించరు. ఈసేవలకుసిఫార్సు లేఖలు స్వీకరిం చబడవు.

వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో అర్జిత సేవలు రద్దు

డిసెంబర్ 29 నుండి జనవరి 1వ తేది వరకు కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేయడం జరిగింది. అదేవిధంగా జనవరి 2వ తేది నుండి 8వ తేది వరకు శ్రీవారి కళ్యాణో త్సవం, ఊంజల్ సేవ, అర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను కూడా ఏకాంతంగా నిర్వహించడం జరుగుతుంది. భక్తులు అనుమతించబడరు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతి

విశాలాంధ్ర-పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సోమవారం ఉదయం తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగలాపురంలోని పాడుబడ్డ పాత ప్రభుత్వ జూనియర్ కళాశాలను తొలగించాలని కోరారు. అలాగే నాగలాపురంలో మండల సమాఖ్య భవనాన్ని నిర్మించడం ద్వారా వెలుగు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయాలకు భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ ను కోరారు.పిచ్చాటూరులో పశువుల విడిది కోసం 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.తన వినతులకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు.

పాదచారుడి మాట.. వ్యాపారి జేబు ఖాళీ

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఓ వ్యాపారిపై చాకచక్యంగా సెల్‌ఫోన్ దొంగతనం జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అంబేద్కర్ సర్కిల్ వద్ద దుకాణం నిర్వహిస్తున్న వ్యాపారి తన ద్విచక్ర వాహనాన్ని దుకాణం సమీపంలో నిలిపి ఉండగా, ఓ వ్యక్తి పాదచారుడిలా వచ్చి "మీ ద్విచక్ర వాహనంలో ఏదో లూజ్‌గా ఉంది చూసుకోండి" అంటూ మాట కలిపాడు. అతడి మాటలు విని గమనించేలోపే, వ్యాపారి షర్ట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను అత్యంత చాకచక్యంగా తీసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడు లబోదిబోమంటూ చుట్టుపక్కల వారిని పిలిచేలోపే దొంగ పరారయ్యాడు. ఇదే తరహా సంఘటనలు గతంలో కూడా పుత్తూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకున్నట్టు స్థానికులు గుర్తు చేస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వ్యాపారులు, వాహనదారులు తమ వ్యక్తిగత వస్తువుల పట్ల మరింత జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అంబేద్కర్ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో పోలీస్ గస్తీ పెంచి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై సిపిఐ ధర్నా

విశాలాంధ్ర-వెంకటగిరి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరణకు వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో వెంకటగిరి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడం జరిగింది కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ చట్టాన్ని పేరు మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అందులో భాగంగా వెంకటగిరిలో నరసన్న కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది యూపీఐ వన్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి 2005లో వామ్మపక్షాల ఎంపీలు ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పులి మీద ఆధారపడిన వారందరికీ జాబ్ కార్డులు ఇచ్చి కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చట్టాన్ని చేయడం జరిగింది ఆ రోజు నుండి నేటి వరకు 20 సంవత్సరాల పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకి రైతులకి ఉపాధి హామీ ఉపయోగపడుతుంది కేంద్ర ప్రభుత్వం కొత్తగా పేరు మార్చి 120 రోజులు పని దినములు కల్పిస్తానని పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టడం జరిగింది. గతంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని ఒకరోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని పనులు చేసే ప్రదేశంలో టెంట్లు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఆయమ్మని త్రాగునీరు పనిచేసే కూలీలకు పనిముట్లు అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ కార్మికుల సంఘం డిమాండ్ చేస్తుంది ఇండియా ప్రభుత్వం ప్రజలకు వ్యవసాయ కూలీలకు మేలు చేసే సవరణ చేయకుండా నిధులను కార్పొరేట్ శక్తులకు నిధులు మళ్లించే ఉద్దేశంతోనే. మహాత్మా గాంధీ పేరుని తీసేసి ఆ స్థానంలో వి బి జి రామ్ జి పేరు మార్చటం దురదృష్టకరమని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యకు ధ్యానం తోడైతే పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం



విశాలాంధ్ర-పుత్తూరు: వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా నిర్వహిస్తున్న ధ్యాన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం పుత్తూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గర్ల్స్), సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ధ్యాన విద్యార్థి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ డి. నాగరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్కూల్‌లో అందించే విద్య బాహ్య ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని అందిస్తే, ధ్యాన విద్య మాత్రం విద్యార్థుల అంతర్ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని అందిస్తుందని తెలిపారు. ఒక సగటు విద్యార్థి పరిపూర్ణ విద్యార్థిగా అన్ని కోణాల్లో అభివృద్ధి చెందుతూ, అత్యున్నత విలువలతో ఆనందంగా ఆదర్శప్రాయంగా జీవించాలంటే వ్యక్తిగత జీవితంలో అద్భుతమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని, అందుకు ఏకైక మార్గం ధ్యానమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు శంకరనాయుడు, పురుషోత్తం చెట్టి, జగదీష్ పాల్గొనగా, కళాశాల అధ్యాపక బృందం సంపూర్ణ సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ అశోక్ రాజుకి టీమ్ సభ్యులు నాగరాజు, శంకర నాయుడు శ్వాస విజ్ఞాన జ్యోతి పుస్తకాన్ని అందచేశారు.

ఇల్లు కూల్చివేతపై కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: నోటీసులు ఇవ్వకుండా మున్సిపాలిటీ అధికారులు తన ఇల్లు కూల్చివేశారని ఆరోపిస్తూ బాధితురాలు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఆమె వ్రాతపూర్వక ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, గతంలో తన నివాసాన్ని కూల్చివేసిన ఘటనపై నవంబర్ 15న కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. అనంతరం జీవనోపాధి కోసం మరో ప్రాంతంలో చిన్న ఇల్లు తీసుకుని, దాని ముందుభాగంలో చిన్న షాపు ఏర్పాటు చేసుకుంది. అయితే నవంబర్ 19న మున్సిపాలిటీ అధికారులు అక్కడికి చేరుకుని, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జేసీబీలతో ఆ ఇల్లు కూల్చివేశారని ఆమె తెలిపారు. హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్న విషయాన్ని తెలియజేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ ఘటనతో తాను మానసిక వేదనకు గురై, జీవనోపాధి కోల్పోయానని బాధితురాలు తెలిపారు. అలాగే ఈ ఘటనకు సంబంధించి తనపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

ఇద్దరు ఎస్‌ఐలు బదిలీ

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లోని ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లను (ఎస్‌ఐలు) స్థానాంతరించే విధంగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. తాజా బదిలీల ప్రకారం, తిరుచానూరు విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి సత్యవేడు పోలీస్ స్టేషన్‌కి, ఎస్‌ఐ జగన్నాథ రెడ్డి మహిళా పోలీస్ స్టేషన్‌కి బదిలీ అయ్యారు. ఇటీవల ట్రైనీగా ఎస్‌ఐగా ఉన్న ఇద్దరు ఎస్‌ఐలు సిద్దారెడ్డి, టీవీ సుధాకర్ ఇటీవల తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. సోమవారం సాయినాథ్ చౌదరి సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో తన బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం నేల ఆరోగ్యానికి అవసరం

రైతు అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయసంచాలకులు సౌభాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-యర్రావారిపాలెం: తిరుపతి డివిజన్ యర్రావారి పాలెం మండలం నందు జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్ష మరియు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక ఆహార భద్రతను ఆరోగ్య భద్రతను కలిగిస్తాయని తెలియజేశారు. తిరుపతి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మనోహర్ బాబు మాట్లాడుతూ రైతులకు తప్పక భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగానే పంటలకు ఎరువులను వాడుకోవాలని అది పర్యావరణానికి మేలు చేయడమే కాక నేల ఆరోగ్యమును కూడా కాపాడుతుందనీ తెలియజేశారు. ఖరీఫ్ 2025 లో రైతులు తమ పొలాల్లోని మట్టిని రైతు సేవా కేంద్రాల ద్వారా భూసార పరీక్షకు పంపిన వారందరూ తమకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల నుండి తమ యొక్క భూసార పరీక్ష ఫలితాల కార్డులను తప్పక తీసుకొని వాటి ఆధారంగానే ఎరువుల వాడకం మరియు యాజమాన్య పద్ధతులను చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వరలకేంద్రం తిరుపతికి చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది మరియు యర్రావారిపాలెం మండల వ్యవసాయ అధికారి ప్రపూర్ణ రెడ్డి ఏ ఈ ఓ నళిని మరియు యర్రావారిపాలెం రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ నిరుపేద కూలీల పొట్ట కొడితే కమ్యూనిస్టులు సహించేది లేదు..

విశాలాంధ్ర-రేణిగుంట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ.. జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి 'విజి- జి.ఆర్.ఏ.ఎం.జి' గా పేరు మార్చడం బిజెపి పార్టీ కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలు "భారతీయుల ఆత్మ గౌరవాన్ని.. స్వాతంత్ర్యం ఉద్యమ అహింస స్ఫూర్తిని" దెబ్బతీయటమేనని.. సిపిఎం పార్టీ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సిపిఐ మండల కార్యదర్శి వై.యస్. మణి, కాంగ్రెస్ పార్టీ నేత చిరంజీవి, భారత్ గెట్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జే.తులసిరాజన్ విమర్శించారు. సోమవారం నాడు రేణిగుంట రైల్వే స్టేషన్ బయట ఉన్న మహాత్మా గాంధీ దంపతుల విగ్రహం వద్ద మిత్రపక్షాలు కాంగ్రెస్ వామపక్షాలు సిపిఐ, సిపిఎం పార్టీ, భారత్ గెట్ మజ్దూర్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు, ఏఐటియుసి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఐద్వా మహిళా సంఘం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. అనంతరం అక్కడనుండి మిత్రపక్షాలు, వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అక్కడినుండి సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ గా వచ్చి అక్కడ కూడా నిరసన తెలియజేశారు. సిపిఎం పార్టీ సీనియర్ కామ్రేడ్ వెంకటరమణ మాట్లాడుతూ..కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా, జాతిపిత మహాత్మా గాంధీ పేరు ను తొలగించాలన్న కుట్రకు పాల్పడింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్, ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి కె.ఈశ్వరమ్మ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వైయస్ మణి, సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సీనియర్ కామ్రేడ్ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య, రేణిగుంట మండల అధ్యక్షుడు మునిరామయ్య, ఏర్పేడు మండలం నాయకుడు వెంకటాద్రి, ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి ఈశ్వరమ్మ, సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్, ఏఐటీయుసి మండల కార్యదర్శి కార్తీక్, మురళి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాజశేఖర్, సెల్వా, డీకేఎంయు జిల్లా అధ్యక్షుడు తులసి రాజన్, ఖాదర్ వలీ, శంషాద్ బేగం, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముడియూరు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలవండి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం సీఎండీ శివశంకర్ కు ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర-పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం ముడియూరులో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కోరారు.సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటికి విచ్చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలుసుకొని ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం అక్కడే ఉన్న విద్యుత్ శాఖ సీఎండీ శివశంకర్ ను కలిసి ముడియూరులో సబ్ స్టేషన్ ఆవశ్యకతను వివరించి వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని విన్నవించారు.తన విజ్ఞప్తి కి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటు సీఎండీ శివశంకర్ సానుకూలంగా స్పందించినట్లు, సబ్ స్టేషన్ కు టెండర్లు పిలవడానికి సుముఖంగా ఉన్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు.

లిడ్ కాప్ భూములు తనిఖీ

విశాలాంధ్ర-గంగాధరనెల్లూరు: లిడ్ కాప్ సంస్థకు ప్రతిపాదనలు చేసిన భూమి పరిశ్రమలు స్థాపించుటకు ఏపీఐఐసీ వారికి కేటాయింపు చేయుటకు భూములు తనిఖీ చేయబడుచున్నవని గంగాధరనెల్లూరు ప్రజలకు విజ్ఞప్తి చేసారు. రామానాయుడు పల్లె వద్ద అగరమంగళం రోడ్డు ప్రక్కన గల అసైన్డ్ భూములు సుమారు 400 ఎకరములు సంబందించిన రైతులు సర్వే టీం అధికారులకు తమ సరిహద్దులు చూపించి హక్కు పత్రములు నకలు అప్పగించ వలసినదిగా మండల తహసీల్దార్ ఒక ప్రకటనలో కోరారు. ఏమైనా సందేహం వున్న ఎడల వీఆర్వో భాస్కర్‌ను గాని తహశీల్దార్‌ను గాని సంప్రదించవచ్చని వారు సూచించారు.

శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన మేధావి అని తెలియజేశారు. గణిత శాస్త్రంలో ఆయన సాధించిన విజయాలు అనితర సాధ్యమైనవని ఆయన పేరు మీదుగా ప్రతి సంవత్సరం సహస్ర అవార్డ్స్ మరియు ఐసిటిపి అనే అవార్డ్స్ ను కూడా అందజేస్తారు ఆయన బాటలోనే ప్రతి విద్యార్థిని కూడా నడవాలని కొనియాడారు అలాగే కళాశాల వ్యాసరసిన వకృత్వ పోటీలు నిర్వహించి అందులో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

భారతీయ వేదగణితం సర్వ గణిత శాఖలకు మూలం: హెచ్.ఎం నాదముని రెడ్డి

విశాలాంధ్ర-కార్వేటినగరం: ప్రపంచం లోని అన్ని గణిత శాఖలకు మూలం భారతీయ వేధగణితమని డీ.ఎం.పురం హెచ్.ఎం నాదముని రెడ్డి పేర్కొన్నారు.జాతీయ గణిత దినోత్సవం శ్రీనివాస్ రామానుజన్ జయంతి డీ.ఎం.పురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చెంగళరాజు, శేఖర్, రమేష్, మాజీ ఎం.పీ.టీ. సి రాధా కృష్ణ యాదవ్ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు,వైస్ చైర్మన్ సంధ్యశేఖర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని గణిత ప్రాముఖ్యత గురించి వివరించారు.ప్రపంచ ప్రఖ్యాత గణిత వేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలు గణితాభివృద్ధి చేసిన కృషిని గణిత ఉపాధ్యాయులు రంజిత్ కుమార్ విద్యార్థులకు వివరించారు.పాఠశాల ఆవరణలో 110కి పైగా గణిత నమూనాలు ప్రదర్శించారు.శ్రీనివాస రామానుజన్ గణిత వీర గాథ నీ బుర్రకథగా చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమం లో శ్రీకృష్ణ యువత నాయకులు విజయ్ కుమార్, సాయి, నిర్మల, గిరిజ, అమ్ములు, కాంతమ్మ, ఉపాధ్యాయులు బొజ్జా రాము, రవి, సరస్వతి, మాలతి, కలై వాణి, రాములు, హరి, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో రెండో రోజు హౌస్ టు హౌస్ కార్యక్రమం తనిఖీ

విశాలాంధ్ర-గుడిపాల: పల్స్ పోలియో 2025 కార్యక్రమంలో భాగంగా రెండో రోజు హౌస్ టు హౌస్ సర్వేను గుడిపాల మండలంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బసవాపల్లి, కోలాటూరు, రామభద్రాపురం, 189 కొత్తపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ పర్యటించి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. రెండో రోజు నిర్వహించిన హౌస్ టు హౌస్ సర్వేలో మిగిలిపోయిన 11 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగింది. మండలవ్యాప్తంగా ఉన్న 4686 గృహాలను ఆరోగ్య కార్యకర్తలు సందర్శించి 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు అందేలా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ మాట్లాడుతూ, ఒక్క పిల్లవాడు కూడా పోలియో చుక్కల నుంచి మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. తల్లిదండ్రులు సహకరించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు సరిత, సునీత, ప్రియా కుమారి, ఆశా కార్యకర్తలు పంకజ, ఇలావతి, శివగామి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

ఓపెన్ స్కూల్ గడువు పెంపు

విశాలాంధ్ర-దక్కిలి: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఎపిఓఎస్ఎస్) మార్చి-2026లో జరగనున్న ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ సవరించిన షెడ్యూల్ విడుదల చేసిందని మండల విద్యాశాఖ అధికారి కె. వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయప మాట్లాడుతూ ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు, విద్యార్థుల పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలు (AP ఆన్‌లైన్ ద్వారా)

వివరాలు	తేదీ నుండి	తేదీ వరకు
అపరాధ రుసుము (Fine) లేకుండా	01.12.2025	22.12.2025
రూ. 25/- అపరాధ రుసుముతో (ప్రతి సబ్జెక్టుకు)	23.12.2025	23.12.2025
రూ. 50/- అపరాధ రుసుముతో (ప్రతి సబ్జెక్టుకు)	24.12.2025	24.12.2025
తత్కాల్ స్కీమ్	25.12.2025	26.12.2025

ఆర్ కే ఎస్ నెక్స్ట్ జెన్ స్కూల్‌లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి నగరం ఎంఆర్ పల్లి కూడలిలో గల ఆర్ కే ఎస్ నెక్స్ట్ జెన్ స్కూల్ లో సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఉత్సాహభరిత పాల్గొనడం తో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గణితం విద్యార్థుల్లో తర్కశక్తి, విశ్లేషణ సామర్థ్యం,సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే ప్రధాన శాస్త్రమని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ ఆర్కే విమల మాట్లాడుతూ భారత గణిత ప్రతిభకు ప్రతీకలైన శ్రీనివాస రామానుజన్ జీవితం ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. పై (జూ) విలువ గణితంలోనే కాకుండా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కూడా కీలకమైనదని వివరించారు. రామానుజన్ పరిశోధనలు ప్రపంచ గణిత రంగాన్ని ప్రభావితం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ శివకుమార్ రెడ్డి గణితం,అబాకస్, 2డి-3డి ఆకారాల మధ్య ఉన్న అనుబంధాన్ని వివరించారు. అబాకస్ ద్వారా వేగవంతమైన లెక్కలు, మానసిక గణన, ఖచ్చితత్వం పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన 2డి, 3డి ఆకారాల వివరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే బాబురెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గణితంపై పట్టు సాధిస్తే భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత విద్యా, వృత్తి రంగాల్లో ముందంజలో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రామానుజన్, పైథాగరస్, ఆర్యభట్ట వంటి మహానుభావుల జీవిత చరిత్రలను కథనాలు, పాటలు, స్కిట్ల రూపంలో ప్రదర్శించారు. గణిత ప్రాముఖ్యతను తెలియజేసే స్కిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఆర్ కే ఎస్ నెక్స్ట్ జెన్ స్కూల్‌కు చెందిన వినాయక క్యాంపస్, వీక్షా క్యాంపస్ లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఈ జాతీయ గణిత దినోత్సవాన్ని ఘన విజయంగా నిలిపారు.

దాతను సన్మానించిన పాఠశాల బృందం

విశాలాంధ్ర-కార్వేటినగరం: డిఎం పురం పూర్వ విద్యార్థి వై రాధాకృష్ణ యాదవను ఆ పాఠశాల హెచ్ఎం నాదముని రెడ్డి ఉపాధ్యాయ బృందం ఘనంగా సాలువులు కప్పి సన్మానించారు. అదేవిధంగా గణిత ఉపాధ్యాయులు రంజిత్ కుమార్ ను కూడా సాలువుల కప్పి ఘనంగా సన్మానించారు. రంజిత్ కుమార్ పుట్టినరోజు వేడుకలు పాఠశాలల్లో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఎన్టీఆర్ రాజు మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: ఎన్టీఆర్ రాజు మృతి పార్టీకి తీరని లోటుని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి తెలియజేశారు. సోమవారం తిరుమలలో ఎన్టీఆర్ రాజు స్వగ్రాహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి అనంతరం రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తండ్రి ఎన్టీఆర్ రాజు మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని తిరుమలలో వారి ఇంటికి వెళ్లి ఓదార్చి వారి కుటుంబానికి భరోసా కల్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని తెలిపారు. గతంలో ఆయన పార్టీకి ఎనలేని సేవలు అందించడం జరిగిందని వివరించారు. గతంలో ఆయన టిటిడి పాలక మండలి సభ్యులుగా ఉన్నప్పుడు తిరుమలలో ఆయన అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు రాజు యాదవ్, భాష, బాలాజీ సుబ్బు, మాధవ్ వేలు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రధానం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం లో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం శ్రీనివాస రామానుజం జన్మదిన సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు వ్యాసరచన, వ్యక్తిత్వం పోటీలు ప్రదర్శన నిర్వహించారు. దీనిలో గెలుపొందిన వారికి ఎస్ఐ తేజస్విని బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖర్ గణిత ఉపాధ్యాయులు చిత్ర రామ్మోహన్ జయదేవ్ రవి వేణు సరితా భారతి గీత రాజేంద్ర పాల్గొన్నారు.

తూగుండ్రం పంచాయతీ విభజనకు మొగ్గు చూపిన ప్రజలు

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ విభజనకు పంచాయతీ పరిధిలోని ఆవలకొండ, కండిగ దళితవాడ, ఆరిమాకుల పల్లి, ఆరిమాకులపల్లి దళితవాడ తొప్పనపల్లి, తొప్పనపల్లి ఆదిఆంధ్రవాడ, దాసరపల్లి, దాసరపల్లి ఎస్టి కాలనీ, దాసరపల్లి ఆదిఆంధ్రవాడ, మోహనాపురం, గ్రామస్తులు రెండు రోజుల క్రితం డిపిఓ కు వినతిపత్రం సమర్పించారు. అందులో భాగంగా సోమవారం సర్పంచ్ శ్రీబాబు, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో శివయ్య మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కొంతమంది గ్రామస్తులు విభజన కోరుతూ జిల్లా ఉన్నతాధికారులను కలిసి ఇచ్చిన వినతిపత్రం మేరకు గ్రామ సభ నిర్వహించారు. తూగుండ్రం పంచాయతీ విభజనకే మెజారిటీ ప్రజలు ఆమోదం తెలిపారు. పంచాయతీ ఉమ్మడిగా ఉండలన్నా, విభజించుకోవాలన్న వారి అభిప్రాయాలను ప్రజలు తెలియజేయవచ్చని తెలిపారు. దీంతో పంచాయతీ ఉమ్మడిగా కొనసాగాలని ఎవరు కోరలేదు గాని విభజన కోసం పలు గ్రామాల ప్రజలు సంతకాలు చేసి, చేతులు సైతం పైకెత్తి తమ మద్దతును పలికారు. గ్రామ సభలో ప్రజలు తెలియజేసిన అభిప్రాయాలను సంతకాలు చేసిన రికార్డు వివరాలను జిల్లా ఉన్నత అధికారులకు పంపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, సచివాలయం ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని ఈసలాపురం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ (మెయింటినెన్స్) పనుల కారణంగా అర్బన్, రూరల్ మండలాలతో పాటు నారాయణవనం, వనమాలపేట మండలాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ దేవా ఆశీర్వాదం, డీడీ రమేష్ తెలిపారు.విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని వారు కోరారు. పనులు పూర్తైన అనంతరం మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

పంచాయతీ విభజనకు గ్రామసభ ఆమోదం

విశాలాంధ్ర-బాలాయపల్లి: మండలంలోని పిగిలాం పంచాయతీలోని జార్లపాడు, కొత్తపాలెం గ్రామాలను పంచాయతీగా విభజించాలని జార్లపాడు గ్రామానికి చెందిన ముప్పాళ్ళ మాధవనాయుడు వినతితో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటి ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజల అభిప్రాయాన్ని కోరుతూ ఓటింగ్ నిర్వహించారు. గ్రామసభ కు హాజరైన 102 మంది అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటి ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపుతా మన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలగంధ లక్ష్మి డీటీ పంచాయతీ కార్యదర్శులు అశోక్ రెడ్డి, దయాకర్, రాజయ్య, నాయకులు ముప్పాళ్ళ మాధవనాయుడు,గోపాల్ యాదవ్, తాళ్ళ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం తినలేము సార్

నిర్లక్ష దోరణిలో సోషల్ వెల్ఫేర్ అధికారులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: పేదరికంతో అల్లాడుతున్న కుటుంబంలో పుట్టి, విద్యాభ్యాసం కోసం పొట్టను చేతిలో పట్టుకుని వసతి గృహంలో చేరితే పురుగుల అన్నం, నీళ్ల సాంబారును వడ్డించి చులకన భావంతో చూస్తున్నారని కళాశాల ఎస్సీ వసతీ గృహంలోని విద్యార్థులు ఆరోపిస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుసగా మూడు రోజులు పాటు పురుగులతో కూడిన భోజనం వడ్డిస్తూ పిల్లలు ఆనారోగ్య పాలవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్య దోరణి వీడ లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వసతి గృహంలో ఉన్న విద్యార్థులు అంటే వెల్ఫేర్ అధికారులకు చులకన అన్నట్లు వ్యవహరిస్తున్నారని. విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి విమర్శలు వస్తున్నారు. ప్రతి విద్యా సంవత్సరం వసతి గృహాల్లో విద్యార్థులు తగ్గుముఖం పడుతున్నారంటే కారణం సంబంధిత వార్డన్లే అందుకు కారణమంటున్నారు. ముద్దకట్టిన అన్నంతో పాటు, భోజనంలో పురుగులు కపిస్తున్నాయని తినలేక చాలి చాలని భోజనం వడ్డించి పిల్ల కడుపులు మాడ్చి వారి జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటకైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహాలను సందర్శించి పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు.

Hon'ble III COURT Judge
BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI
MCOP.NO : 3141 / 2025
K.SREEHARI NAIDU
..Petitioner
-vs-
1) CHEJARLA NARAYANA BABU
2) ACKO General insurance Limited.
..Respondent
Notice to the Respondent No.1
R1) CHEJARLA NARAYANA BABU, No : 5-31/3,
KBR puram village and post ,
Puttur mandal ,
Tirupathi Dist,
Andhra Pradesh -517584
Take Notice that the above case is posted to 26/2/2026 at 10.30 am Before the Hon'ble III COURT Judge of small causes court , Chennai For your appearance in person or through pleaders without fail or otherwise the matter will be decided in your absence.
C.HEMANT RAO
COUNSEL FOR PETITIONERS
CHENNAI, TAMILNADU STATE

అటవీ భూములు కబ్జా

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు గిరిజనుల వినతి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, పోలీపాడు, భువనగిరి పాలెం గ్రామ పరిధిలోని ప్రభుత్వ అటవీ భూములను అక్రమంగా కబ్జా చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని, భూమిలేని గిరిజన కుటుంబాలకు ఆ భూములను కేటాయించాలని గిరిజన కులానికి చెందిన ప్రజలు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్‌ను కోరారు. ఓజిలి మండలం భువనగిరి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.1లో ఉన్న 173 ఎకరాలకు పైగా ప్రభుత్వ, అటవీ పోరంబోకు భూమిని గిరిజనుల సంక్షేమార్థం కేటాయించాలని పలుమార్లు అధికారులను ఆశ్రయించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో మిగిలిన అటవీ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మార్వో, వీఆర్వో, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు అందజేశామని, 2023 జూలై 18న వ్రాతపూర్వకంగా కలెక్టర్ ప్రజావేదిక ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగలేదని తెలిపారు. అక్రమ కబ్జాల వల్ల ప్రభుత్వ భూమితో పాటు గిరిజనుల స్మశానాన్ని కూడా దున్నేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించిన వారిపై తక్షణ చర్యలు తీసుకుని, భూమిలేని గిరిజనులకు ఆ భూములను కేటాయించాలని పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలోని మగరాల గ్రామపంచాయతీ కృష్ణాపురం గ్రామంలోని పేదలకు సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని మురళీమోహన్ ల చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సొంత ఇల్లు లేని పేద ప్రజలకు ఇంటి స్థలం తో పాటు ఇల్లు కట్టివ్వడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంపై స్పష్టంగా తెలియజేశారని త్వరలోనే తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ,కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ ఆదర్శం

విశాలాంధ్ర పుత్తూరు: ప్రతిభకు పేదరికం అడ్డం కాదని నిరూపించిన మహనీయుడు శ్రీనివాస రామానుజన్ అని, విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ బి. చంద్రమౌళి అన్నారు. డిసెంబర్ 22వ తేదీ సోమవారం ప్రసిద్ధ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవసభ జరిగింది. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గణిత మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని, రామానుజన్ కేవలం 32 సంవత్సరాలు జీవించినా అనేక గణిత సమస్యలను పరిష్కరించారని, సుమారు 3900 గణిత సమస్యలకు పరిష్కారాలు సూచించిన గొప్ప మేధావి అని ప్రిన్సిపాల్ తెలిపారు.గణిత శాస్త్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ పి.గాయత్రి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో గణిత శాస్త్రం యొక్క పాత్ర చాలా ఎక్కువ అని అన్నారు, శ్రీనివాస రామానుజన్ జీవితం విద్యార్థుల్లో జ్ఞాన దాహాన్ని పెంచి భారతదేశాన్ని విజ్ఞాన దేశంగా తీర్చిదిద్దడంలో దోహదపడుతుందని ఇతర వక్తలు పేర్కొన్నారు. ఈ సభలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పుష్పమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ పి. గాయత్రి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ పి. సుజన,డాక్టర్ సురేష్, డాక్టర్ శంకర్రావు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి వెంకటగిరి నియోజకవర్గ సమస్యలు

విశాలాంధ్ర-వెంకటగిరి: ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు త్వరలో నిధులు, గొడ్డేరు ఆనకట్ట, గోషా ఆసుపత్రి అభివృద్ధికి సీఎం హామీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆయన సీఎంని కోరారు. ఎన్నికల ముందు వెంకటగిరి పర్యటనలో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని సీఎం ఇచ్చిన హామీని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా వెంకటగిరి పట్టణంలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని గోషా ఆసుపత్రి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని సీఎం స్పష్టం చేసినట్లు చెప్పారు. గొడ్డేరు ఆనకట్ట నిర్మాణం, కావల్యానది అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కైవల్యానదికి వరదలు వచ్చినప్పుడు పట్టణంలో నదికి ఇరువైపులా తీవ్రంగా కోత జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. నదికి ఇరువైపులా కాంక్రీట్ వాల్ నిర్మించడం, అవసరమైన చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

జూనియర్ కళాశాలకు క్రీడా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-వెంకటగిరి: విశ్రాంత ఉపాధ్యాయులు పునుగోటి సుబ్రహ్మణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల, వెంకటగిరి ప్రిన్సిపల్ రవి కుమార్ 15000/- రూపాయల విలువగల క్రీడా సామాగ్రిని అందచేశారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొదించుకోవాలనే లక్ష్యంతో పేద విద్యార్దులు చదువుతున్న ఈ కళాశాలకు వీటిని అందచేస్తున్నానని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీంద్ర బాబు, శేష మరియు సీనియర్ సహాయకులు గోపీ తదితరులు పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యం దాతృత్వానికి ప్రిన్సిపల్ మరియు కళాశాల సుబ్బంది, విద్యార్థులందరు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి: పొన్నా కాటయ్య

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పురపాలక సంఘం పరిధిలోని స్వతంత్ర పురంలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే నెంబర్ 32/3 బి గుంట పోరంబోకు ఆక్రమణలకు గురి కాకుండ కాపాడాలని సూళ్లూరుపేట,రాజీవ్ నగర్ కాలనీకి చెందిన జనసేనా పార్టీ పట్టణ అధ్యక్షులు పొన్నా కాటయ్య, గ్రీవెన్స్ లో భాగంగా సోమవారం స్థానికి తహాసిల్దార్ పి.గోఫినాద్‌రెడ్డి, కి ఆర్జి సమర్పించారు. అనంతరం కాటయ్య, మాట్లాడుతూ స్వతంత్ర పురంలో ఉన్న గుంట పోరంబోకు స్థలం ఆక్రమణ చేసి నిర్మాణాలు చేపట్టడం పై ప్రజా ప్రతినిదులకు, అధికారుల దృష్టికి తీసుకు పోవడం జరిగిందని అన్నారు. కాని ఎవరు అధికారులు స్పందించకపోవడంతో హై కోర్టును ఆశ్ర ఇంచడం జరిగిందని తెలిపారు.ఆక్రమణలను తొలిగించి ప్రభుత్వ భూమిని పురపాలక సంఘంలోని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించు కునేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సవరణను వ్యతిరేకిస్తూ సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ సిపిఎం పుత్తూరు డివిజన్ కార్యదర్శి డి మహేష్ ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ చట్టాన్ని పేరు మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అందులో భాగంగా పుత్తూరు నరసన్న కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది యూపీఐ వన్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి 2005లో వామ్మపక్షాల ఎంపీలు ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పులి మీద ఆధారపడిన వారందరికీ జాబ్ కార్డులు ఇచ్చి కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చట్టాన్ని చేయడం జరిగింది ఆ రోజు నుండి నేటి వరకు 20 సంవత్సరాల పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకి రైతులకి ఉపాధి హామీ ఉపయోగపడుతుంది కేంద్ర ప్రభుత్వం కొత్తగా పేరు మార్చి 120 రోజులు పని దినములు కల్పిస్తానని పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టడం జరిగింది గతంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని ఒకరోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని పనులు చేసే ప్రదేశంలో టెంట్లు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఆయమ్మని త్రాగునీరు పనిచేసే కూలీలకు పనిముట్లు అందించాలని వామపక్ష పార్టీలు వ్యవసాయ కార్మికుల సంఘం డిమాండ్ చేస్తుంది బిజెపి ప్రభుత్వం ప్రజలకు వ్యవసాయ కూలీలకు మేలు చేసే సవరణ చేయకుండా నిధులను కార్పొరేట్ శక్తులకు నిధులు మళ్లించే ఉద్దేశంతోనే. మహాత్మా గాంధీ పేరుని తీసేసి ఆ స్థానంలో వి బి జి రామ్ జి పేరు మార్చటం దురదృష్టకరమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తక్షణమే పెట్టిన పేరుని ఉపసంహరించుకోవాలని లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణారెడ్డి సర్వనా వెంకటయ్య సిపిఎం నాయకులు దేశమ్మ రాఘవమ్మ కాంతారావు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు హాజరు శాతం చాలా ముఖ్యం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రార్థన సమయానికి విద్యార్థులు తప్పని సరిగా హాజరు కావాలి హాజరు శాతం చాలా ముఖ్యం అంటూ రెండోవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రార్థన సమయాన్ని విద్యాశాఖ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలోని ప్రార్థనా సమయానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు,ఎందుకంటే ఇది విద్యా సంస్థలలో ఒక ముఖ్యమైన భాగం మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం హాజరు శాతం చాలా ముఖ్యం, దీనికోసం ముఖ హాజరు విధానం అమలులో ఉన్నాయన్నారు. ప్రార్థన సమయానికి హాజరైనప్పుడే, విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు, వారి హాజరు నమోదు సక్రమంగా ఉంటుంది, లేకపోతే ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోవచ్చు, అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు దీనిపై శ్రద్ధ చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నియమాల ప్రకారం విద్యార్థులకు కనీసం 75% హాజరు తప్పనిసరి, లేకపోతే ప్రభుత్వ పథకాలకు డబ్బులు అకౌంట్ లో జమకావు అన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ప్రార్థన సమయానికి ముందే హాజరు కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది మరియు విద్యార్థుల ప్రోత్సహించాలన్నారు. అనంతరం పెద్ద పాలివేడు, చిన్న పాలెవేడు, గ్రామాల్లో పాఠశాలను తనిఖీ చేపట్టారు, విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ విద్యా ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు విద్యాబోధన అందించాలని వివరించారు.

సత్యవేడు ఎస్ఐగా సాయినాథ్ చౌదరి

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు పోలీసు సబ్ ఇన్స్పెక్టర్గా సాయినాథ్ చౌదరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.పరిపాలన సౌలభ్యంలో భాగంగా జిల్లాలో కొందరు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీసే చేయడం జరిగింది.ఈ నేపథ్యంలో ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న రామస్వామిని తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్కు బదిలీ చేయగా,తిరుచానూరు ఎస్సైగా పనిచేస్తున్న సాయినాథ్ చౌదరిని సత్యవేడు సబ్ ఇన్స్పెక్టర్గా బదిలీ చేయడం జరిగింది.ఈ క్రమంలో సత్యవేడు నూతన ఎస్ఐగా సాయినాథ్ చౌదరి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై సాయినాథ్ చౌదరి మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడా కూడా అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు సత్యవేడు పట్టణంలో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి త్వరలోనే గాడిలో పెడతామన్నారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం యదావిధిగా కొనసాగించాలి

వికసిత్ భారతి జి రాం జీ పథకాన్ని రద్దు చేయాలి: నగరి సిపిఐ పార్టీ డిమాండ్

విశాలాంధ్ర-నగరి: భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపన్యా ఉపాధి హామీ పథకం చట్టంలో మార్పు వ్యతిరేకిస్తూ నగరి అంబేద్కర్ విగ్రహం దగ్గర సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలం అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును బిజెపి మోడీ ప్రభుత్వం మార్చడానికి వ్యతిరేకంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం అనంతరం జీవో ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. గతంలో యూపీఐ ప్రభుత్వం ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పనులేను కొండ లేకుండా పట్టణాలకు వలసలు పోతున్న సందర్భంగా అప్పట్లో కార్మిక కమ్యూనిస్టు పార్టీ ప్రజలతో కలిసి పోరాటాలు చేసి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చట్టం చేయడం జరిగింది దీనివలన గ్రామాల్లో పట్టణాలకు వలస తగ్గి సొంత గ్రామాల్లోనే పనులు చేసుకుని జీవించడానికి మరియు వ్యవసాయానికి ఈ మరియు భూగర్భ జలాలను పెంచుకోవడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది అలాంటి పథకాన్ని సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు 500 రూపాయలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం వలన జాతీయ స్థాయిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు పెట్టడం జరిగింది స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ మన భారత దేశ జాతిపిత పిలవబడే ఆయన పేరును మార్చడాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని ఉపసంహరించకపోతే ప్రజలే తగిన గుణపాఠం చేపతారని హెచ్చరించారు సమావేశంలో ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య పట్టణ కార్యదర్శులు వేలన్ సిపిఐ పార్టీ పట్టణ నాయకులు భాషా ప్రజాసంఘాల నాయకులు యేసయ్య సురేష్ ముత్తు నాగూర్ ఏసుదాస్ మునిరాజు మనీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే అమర్ ను కలసిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్

విశాలాంధ్ర-పలమనేరు: తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సూచించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తవణంపల్లి మండలంనకు చెందిన వై. సునీల్ కుమార్ చౌదరి నియమితులయ్యారు. దీంతో తొలుతా శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని పలమనేరు పార్టీ కార్యాలయంలో తవణంపల్లి మండల నాయకులతో కలసి సోమవారం మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కల్పించిన గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో పార్టీకి చాలా మంది ప్రముఖులు పనిచేసిన చరిత్రను గుర్తించుకొని అందరి సమన్వయంతో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. పార్టీలోని పెద్దల సలహాలు సూచనలతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ రవి ప్రసాద్, నాయకులు సమీర్ చౌదరి, శివకుమార్, ప్రకాష్, సువిష్, సురేష్, రెడ్డప్ప,బలరాం రెడ్డి తదితరులున్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదినం సందర్భంగా అన్నదానం

వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమను చాటాలి: యువనేత మంజునాథ్

విశాలాంధ్ర-బంగారుపాళ్యం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 53వ జన్మదిన వేడుకలను చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంబకుప్పం సర్పంచ్ లీలావతమ్మ కుమారుడు, వైకాపా యువ నాయకుడు మంజునాథ్ ఆధ్వర్యంలో మానవత్వాన్ని చాటుకున్నారు.పలమనేరుకు చెందిన 'అక్షర మానసిక వికలాంగుల పాఠశాల' పిల్లలకు మంజునాథ్ ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులందరూ కేక్ కట్ చేసి, "హ్యాపీ బర్త్ డే టూ యు జగన్ మామ" అంటూ నినాదాలు చేస్తూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.?ఈ సందర్భంగా యువ నాయకుడు మంజునాథ్ మాట్లాడుతూ:"మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని, తోటివారికి సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టాం. ముఖ్యంగా మానసిక వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ కరుణ, ప్రేమను కలిగి ఉండాలి. వారిని సమాజంలో భాగస్వాములుగా చూస్తూ ఆదరించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో పై సర్వే

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం పై సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సి.హెచ్.ఓ డివస్ వెంకటేశ్వర్లు సమగ్ర సర్వే నిర్వహించారు. మండలంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం పై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య అధికారి గ్రామాలలో పర్యటించి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారా లేదా పరిశీలించారు. సమయానికి పోలియో చుక్కలు వేసుకోలేనటువంటి వారికి పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో వేసుకోకుండా ఇంటిదగ్గర మారుమూల ప్రాంతంలో ఉన్నటువంటి 111 మంది పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయడమైనది. ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటోళ్ల జన బాటను ప్రారంభించిన మంత్రి రవికుమార్

విశాలాంధ్ర-పాకాల: రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన కరంటోళ్ల జన బాట కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పాకాల మండలంలో ప్రారంభించారు. మొగరాల గ్రామపంచాయతీ కృష్ణాపురంలో కరెంటోల్ల జన బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల కోసం విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగి పని లేకుండా విద్యుత్ సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. మండలంలో 10 రోజులపాటు అన్ని గ్రామాలలో పర్యటించి కరెంటు సమస్యలను సిబ్బంది తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తారని తద్వారా లో వోల్టేజ్ వంటి సమస్యలు తొలగిపోతాయని చెప్పారు. అనంతరం కృష్ణాపురం గ్రామంలో పర్యటించి కరెంటు సమస్యలను గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి పూతలపట్టు శాసనసభ్యులు పులివర్తి నాని ,మురళీమోహన్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు శిక్షణ

విశాలాంధ్ర-తడ: ప్రకృతి వ్యవసాయ శాఖ వెలుగు మండల సమైక్య సమన్వయంతోనే ప్రకృతి వ్యవసాయం ముందుకు సాగుతుం దని ఏపిఎం రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తడలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎం రాజారెడ్డి మాట్లాడుతూ మహిళా సమైక్య సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సబీనా, సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయంలో అనుసరించవలసిన పద్ధతులు రాజీలేని సూత్రాల గురించి మహిళా సమైక్య సభ్యులకు వివరించారు. ప్రతి మహిళా సభ్యురాలు తమ పొలంలో కూరగాయలు ఆకుకూరలు, వరి వంటి ఆహార ధాన్యాలను ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసుకోవాలని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచనలు సలహాలు అందజేశారు.

మహిళా టెన్నిస్ క్రీడాకారిణిలకు ఆహ్వానం: హెటల్ అధినేత బద్రిగిరి

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలపరిధిలోని జాతీయ రహదారిపై, ఏ-5 హెటల్ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టు లలో తమ క్రీడాప్రతిభను ప్రదర్శించడానికి విచ్చేసిన మహిళా క్రీడాకారిణులకు ఏ-5 హెటల్ అధినేత మరియు సమన్వయకర్త బద్రిగిరి సోమవారం యంయల్ఏ పాశం సునీల్ కుమార్, సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, గూడూరు పట్టణంలో పేదలకు మరియు ప్రజానీకానికి విశిష్ట వైద్య సేవలు సుధీర్ఘ కాలంగా అందిస్తున్న సిఆర్ రెడ్డి అసుపత్రి వైద్యులు, నిర్వాహకులు జనార్ధనరెడ్డి, రోహిణి, శ్రీమంతుడు కనుమూరి హరి చంద్రారెడ్డి తదితరులతో కలసి ఆహ్వానం పలికారు.

శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌కు అభినందనలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షులుగా రేణిగుంట డిప్యూటీ తాసిల్దార్ (డీటీ) శ్యాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, వీఆర్వో చెంగల్రాయులు ఆయనకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. శ్యాంప్రసాద్ ఎంతో సౌమ్యుడు వివాదారహితులు అని ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటారని తెలిపారు. తిరుమలశ్రీవారు, శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాక్షించారు.

మురళీధర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దివంగత ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి.మురళీధర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని ముక్కంటి ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామనగర్ కాలనీలో సోమవారం మురళీధర్ రెడ్డి కర్మక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి చిత్రపటానికి ఈవో బాపిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముక్కంటి ఆలయ అభివృద్ధి పనుల్లో మురళీధర్ రెడ్డి కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆకస్మిక మరణం తమకు తీరని లోటన్నారు. మురళీధర్ రెడ్డి కుటుంబ సభ్యులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.

సరస్వతి శిశు మందిరంలో మ్యాథమెటిక్స్ డే

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజు సందర్భంగా మ్యాథమెటిక్స్ డే భాగంగా విద్యార్థులు అనేక రకాల మ్యాథమెటిక్స్ యాక్టివిటీస్ చేసి ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి, పాఠశాల కార్యదర్శి డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) మరియు పాఠశాల కోశాధికారి రావూరు రవిచంద్ర పాల్గొని మ్యాథమెటిక్స్ డే అలాగే శ్రీనివాస రామానుజన్ యొక్క గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. అలాగే విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానాచార్యులు వి.రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

గ్రామ సభల ద్వారా ఉపాధి పనులు: ఎంపీఓ

విశాలాంధ్ర-డక్కిలి: ఉపాధి హామీ పనులు గ్రామ సభలు ద్వారా ఎంపికైన పనులు నిర్వహించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమార్ స్వామి పేర్కోన్నారు.సోమవారం ఉపాధి సిబ్బంది తో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో పనులు గుర్తించి వున్న పనులు మాత్రమే చేయలన్నారు. డ్వాక్రా మహిళల ద్వారా ఎక్కువ ప్రచారం చేసి పనులు పెట్టాలన్నారు. రైతులకు ఉపయోగ పడే పనులు పంట కాలువలు పూడిక తీత పనులు, వ్యవసాయనికి అను సందనమైన పనులు చేయలరున్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు వికలాంగుల క్యూ

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వికలాంగులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. సాధారణ సోమవారాలతో పోల్చితే ఈసారి వికలాంగుల రాక అధికంగా ఉండడం గమనార్హం. వీరిలో ఎక్కువ మంది వికలాంగుల పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చారు. కలెక్టరేట్ కు వచ్చే వికలాంగుల కు అర్జీలు రాసేందుకు ఒక ప్రత్యేక కౌంటర్ ను సహాయకులను కూడా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో వీల్‌చైర్లు తగినంతగా లేకపోవడంతో కొంతమంది వికలాంగులు తమ సహాయకులపై ఆధారపడి లోపలికి ప్రవేశించాల్సి వచ్చింది. ఒకే రోజు ఇంత పెద్ద సంఖ్యలో వికలాంగులు దరఖాస్తులు రావడానికి కారణాలు ఏమిటన్నది స్పష్టత కావాల్సిన అంశంగా మారింది.

పరీక్షా సామగ్రి వితరణ

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు ఎస్.హరిప్రియ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దివంగత టి.వి రమణరావు జ్ఞాపకార్థం, వారి మనవరాలు టి.వి ఆద్య సౌజన్యంతో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు హరిప్రియ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు లక్ష్యసాధనతో చదువుపై దృష్టి పెట్టాలని, పరీక్షల పట్ల భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సమాజం నుంచి లభిస్తున్న సహకారం విద్యార్థులకు మరింత ప్రోత్సాహం ఇస్తుందని పేర్కొన్నారు. దాత టివి రాజేష్ మిత్రులు సి.హేమంత్ కుమార్, చేతులమీదుగా విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ కె.మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరును జిల్లా చేయాలి: దేగ రవి రాఘవేంద్ర



విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని పెద్ద మసీదు నుండి ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులతో గూడూరులో జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గూడూరులో జిల్లా చేయాలని కాని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలన్న నినాదాలతో పట్టణం మారుమోగింది టవర్ క్లాక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు ఫోరం ఉపాధ్యక్షులు అర్ధనగ్నంగా తల్లకిందులుగా నిల్చుకొని వినూత్న నిరసన తెలియజేశారు. అనంతరం జేఏసీకి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫోరం జాతీయ అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా గూడూరు తిరుపతి జిల్లాలో కలపడం జరిగిందని అప్పటినుండి ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి మకాని వెంకటేశ్వర్లు ,తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన లక్ష్మీ

విశాలాంధ్ర-వి.కోట: జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జి.లక్ష్మీ ఎంపికైంది. మండలంలోని పాముగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న జి. లక్ష్మీ ఈ నెల 19, 20, 21 తేదీలలో ప్రకాశం జిల్లా జే పొంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఖో ఖో పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు తరపున ఆడి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జి. లక్ష్మీ ని జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ తెలిపారు. ఈ నెల 31 నుంచి జనవరి 4 వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీ లలో మన రాష్ట్ర ఖో ఖో జట్టు తరపున లక్ష్మి ఆడతుందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి కి తర్ఫీదు ఇచ్చిన పి. డి. ఏ హరిప్రసాద్ ను ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు అభినందించారు.

28న శ్రీ శ్రీనివాస రామానుజన్ గణిత ప్రతిభా పరీక్ష

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం "శ్రీ శ్రీనివాస రామానుజన్ మాథమెటిక్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్" నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ గణిత ప్రతిభా పరీక్షకు సంబంధించిన సమాచార పత్రికను స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి తో పాటు అప్పుస్మా నాయకులు బీ. రవీంద్ర రెడ్డి, డి.జి. రఘు నారాయణ రావు, ఎస్.ఎం. బాషా, టి. రామకృష్ణ రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వచందన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడం, గణితంపై ఆసక్తిని పెంపొందించడం, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడమే ఈ పరీక్ష ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ గణిత ప్రతిభా పరీక్షను డిసెంబర్ 28న విశ్వం టాలెంట్ స్కూల్, వరదరాజనగర్, కే.టి. రోడ్ మరియు విశ్వం హై స్కూల్, జీవకోన పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు అని పేర్కొన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తరగతి వారీగా ప్రథమ బహుమతి రూ.15,000/-, ద్వితీయ బహుమతి రూ.10,000/- మరియు తృతీయ బహుమతి రూ.5,000/-తో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 8688888802, 9177726256 నంబర్లకు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

గూడూరు - గిద్దలూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు - గిద్దలూరు రోడ్డుకు మరమ్మతులు చేయండి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014వ సంవత్సరం ముందు వేసిన రోడ్డును మరమ్మత్తు పనులు చేయకుండా ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో ఉన్న 15 గ్రామాలు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి రోజు దాదాపు 7 వేల మందికి పైగా ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, కర్షకులు, కార్మికులు, రైతులు రాకపోకలు సాగించలేక నానావస్థలు పడుతున్నారన్నారు. ఎంతోమంది ఈ రహదారిలో ప్రయాణించడం వలన నడుము విరిగి, కాళ్ళు చేతులు విరిగి ఆసుపత్రులపాలైనారు. నిండు గర్భిణులు సైతం చాలా మంది ఇబ్బందిన పడిన పరిస్థితి, మనం ప్రజలకు మేలు చేసే విధంగా రోడ్డు, రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని మరచినట్లున్నారాని ఎద్దేవా చేశారు. వాహనం కొనేటప్పుడు అన్ని టాక్సు కట్టించుకుంటూ ప్రభుత్వమే ప్రజలకు రోడ్డు వసతి కల్పించలేకపోవడం దుర్మార్గం అని తెలిపారు. 05.05.2025న గూడూరు సబ్-కలెక్టర్ కి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ర.భ.) వారికి అర్జీ సమర్పించి రోడ్డు బాగుచేయాలని కోరగా వారు 4 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మతు పనులు చేసినట్లుగా మాకు చెప్పడం జరిగిందన్నారు. వెంటనే గూడూరు నుండి గిద్దలూరు రోడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభించకుంటే కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గత పదేళ్లు పైగా మరమ్మతు పనులు చేపట్టకపోవడానికి అధికారుల నిర్లక్ష వైఖరే కారణమని భావించాల్సి ఉందన్నారు.. గత వై.సి.పి. ప్రభుత్వం నేడు తెలుగుదేశం ప్రభుత్వం రెండు మీ రోడ్డును బాగుచేస్తామని చెప్పి ఓట్లు దండుకోవడం తప్ప ఎటువంటి మరమ్మత్తులు పనులు చేయకపోగా, డబుల్ రోడ్డు మంజూరు అయినదని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టి వెంటనే సదరు రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రామకృష్ణ , సుబ్బరాజు, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

రొమ్మల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హెల్మెట్లు పంపిణీ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో తనపల్లిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అమలు చేస్తున్న నో హెల్మెట్ నో పెట్రోల్ అనే వినూత్న కార్యక్రమానికి ఇది కొనసాగింపుగా నిలిచింది. ఇదే క్రమంలో ఇండియన్ ఆయిల్ తిరుపతి డివిజన్ ఆధ్వర్యంలో వేర్ హెల్మెట్ సేవ్ లైవ్స్ అనే గొప్ప క్యాంపెయిన్‌ను నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ కార్యక్రమానికి మద్దతుగా, అలాగే పోలీస్ శాఖ ప్రయత్నాలకు స్ఫూర్తిగా నిలుస్తూ రొమ్మల ఫౌండేషన్ తరఫున సోమవారం హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రొమ్మల ఫౌండేషన్ ఛైర్మన్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రొమ్మల ఫౌండేషన్ గతంలో కూడా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని, భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. హెల్మెట్ ధరించడం మన ప్రాణాల రక్షణకే కాకుండా, మన కుటుంబాల భద్రతకు, మనపై వారు పెట్టుకున్న నమ్మకాలు, ఆశలు నెరవేర్చడానికి ఎంతో అవసరమని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో ముఖ్యమని తెలియజేస్తూ, అందరూ విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. చివరగా ఈ కార్యక్రమానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖోలో బంగారుపాళ్యం విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర-బంగారుపాళ్యం: ప్రకాశం జిల్లాలో ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు రాష్ట్ర విజేతగా నిలిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. కీలక పాత్ర పోషించిన క్రీడాకారిణులు: జట్టు విజయంలో బంగారుపాళ్యం పాఠశాలకు చెందిన క్రీడాకారిణులు దీప్తి, ఉమేరా, జయశ్రీ, మరియు కావ్య అత్యుత్తమ ప్రదర్శనతో కీలక పాత్ర పోషించారని హెచ్.ఎం రాజేంద్రన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో రాణించిన వీరు త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినులను జాతీయ స్థాయికి చేర్చేలా నిరంతరం కృషి చేసి, తర్ఫీదునిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ మధుబాబును పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు గిరిజ, సరస్వతి పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

జనవాణితో సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం నందు నియోజవర్గ ఇన్చార్జ్ చిన్న రాయల్ పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్ రాయల్ కుమార్ శ్రీనివాసులు జన వాణి కార్యక్రమాన్ని సోమవారం రోజున నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద మొత్తంలో ప్రజలు మండలంలోని అనేక గ్రామాల నుండి తరలివచ్చి వారి వారి సమస్యలను జనవాని ద్వారా జనసేన నేతలకు వివరించడం జరిగింది ఈ సమస్యల పరిష్కారం కోసం జనసేన నేతలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగింది. పట్టణంలోని సుభారాం డిగ్రీ కళాశాల ఆవరణం నందు మినీ స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలని క్రీడాకారులు జనసేన నేతలకు విన్నవించుకోవడం జరిగింది. సంబంధిత శాఖ వారి దృష్టికి తీసుకుని వెళ్లి మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని క్రీడాకారులకు జనసేన నేతలు హామీ ఇవ్వడం జరిగింది.

రికార్డు స్థాయిలో చేపల చెరువుల వేలం

విశాలాంధ్ర బైరెడ్డిపల్లి బైరెడ్డిపల్లి మండలం గొల్ల చీమలపల్లి ఆలపల్లి పంచాయతీలలోని చెరువులకు సోమవారం వేలం వేయడం జరిగినది ఈ సంవత్సరానికి గాను ఈ చెరువులలో చాపలు పట్టుకోవడానికి వీలుగా ప్రతి సంవత్సరం వేలం వేయడం జరుగుతున్నది . ఆలపల్లికి చెందిన నాలుగు చెరువులకు గాను 46.000 ఆలయం రాగా, గొల్ల చీమలపల్లి చెరువులకు లక్ష 84000 ఆదాయం వచ్చింది. గుల్లొచ్చి మన పల్లెలో గతంలో ఒక చెరువు 41000/- కి వేలంపాడగా ఈ సంవత్సరం గణనీయంగా పెరిగి రూ.1,50,000 వేలంలో వెళ్ళినది ఈ వేలం పాట కార్యక్రమాన్ని బైరెడ్డిపల్లి మండల డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి పర్యవేక్షించారు.

ఉపాధి హామీ పేరు మార్పు పేదల పొట్టకొట్టే చర్య

గాడ్సే వారసుల మెప్పు కోసమే గాంధీ పేరు తొలగింపు

తిరుపతి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీల నిరసన

విశాలాంధ్ర-తిరుపతి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పేరు మార్చడం పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమని సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి సీపీఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు విమర్శించారు. సోమవారం 10 వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట సిపిఐ సిపిఎం ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పి మురళి వి నాగరాజు వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)గా మార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటాన్ని పూర్తిగా తప్పు పట్టారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మను, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడం వంటి గొప్ప లక్ష్యాలతో ప్రవేశపెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు. గతంలో వంద శాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని పేర్కొన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువలపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తున్నదని ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపుతున్నదని పేర్కొన్నారు. చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ, బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏ ఏడాదిలోనూ 42 రోజుల కన్నా ఎక్కువ పని దినాలు కల్పించలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులతో, బాధ్యతాయుతంగా కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే రాధాకృష్ణ నగర కార్యదర్శి జె విశ్వనాథ్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జయ చంద్ర ,వేణు , సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి కె పద్మనాభరెడ్డి కే వై రాజా ఎన్ శివ వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం రామకృష్ణ, అల్లబక్షు, అలివేలు లక్ష్మీ, సాయి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్ పేటలో అపోలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

తొలిరోజు గ్రామంలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

విశాలాంధ్ర-చిత్తూరు: గ్రామీణాభివృద్ధి, పరిశుభ్రత లక్ష్యంగా ది అపోలో యూనివర్సిటీకి చెందిన జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) యూనిట్ - 2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం సోమవారం చిత్తూరు మండలంలోని ఎన్‌ఆర్ పేట గ్రామంలో ప్రారంభమైంది. డిసెంబర్ 22 నుంచి 28 వరకు వారం రోజుల పాటు సాగనున్న ఈ శిబిరంలో స్వచ్ఛ భారత్ అభియాన్, మొక్కలు నాటడం, ఆరోగ్యం, సాక్షరత, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్ పేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. హేమాద్రి రెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ, శిబిరంలో భాగంగా స్వచ్ఛ భారత్ అభియాన్, మొక్కలు నాటడం, సాక్షరత కార్యక్రమాలు, కెరీర్ గైడెన్స్, సీపీఆర్ (సిపిఆర్) శిక్షణ, ఆరోగ్య శిబిరం, అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలంటీర్లు క్రమశిక్షణ తో పాల్గొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షేక్ జాకీర్ మాట్లాడుతూ, యువతలో సేవాభావం, సామాజిక చైతన్యం పెంపొందించడమే ఈ ప్రత్యేక శిబిరం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎన్‌ఆర్ పేట జెడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ రమేష్ అపోలో యూనిర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ, విద్యార్థులు విద్యతో పాటు సామా జిక సేవలోనూ ముందుండటం అభినందనీయమని అన్నారు. శిబిరం నిర్వహణకు నిరంతర సహకారం అందించిన జెడ్పీహెచ్ ఎస్ ఎన్‌ఆర్ పేట గణిత ఉపాధ్యాయుడు హరి బాబును ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుడు మునిరత్నం రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గీత, వీఆర్‌ఓ సతీష్ కుమార్ పాల్గొని ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరానికి గ్రామస్థాయి నుంచి పూర్తి సహకారం అందజేస్తామని తెలిపారు. శిబిరం మొదటి రోజున స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు గ్రామ రహదారులు, ప్రజా ప్రదేశాలు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గ్రామస్తుల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు కలిసి పరిశుభ్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పంచాయతీలలో పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు

చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు

విశాలాంధ్ర-చిత్తూరు: గ్రామ పంచాయతీ లలో పారిశుధ్యం మెరుగు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యల్లో భాగంగా ఎం పి లాడ్స్ కింద గంగాధర నెల్లూరు మండలానికి 20 ఇ-ఆటో ల పంపిణీ చేపట్టామని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయ ప్రాంగణంలో గంగాధర నెల్లూరు మండలానికి సంబంధించి పంపిణీ చేసిన 20 ఇ - ఆటో ల ను చిత్తూరు ఎంపి, ప్రభుత్వ విప్ మరియు గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎంఎల్ఏ వి.ఎం.థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎం పి మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంట్ పరిధిలో గల 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న మేజర్ పంచాయతీలు గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గంగాధర నెల్లూరు నియోజకవర్గం గంగాధర నెల్లూరు మండలానికి ఎం పి లాడ్స్ కింద రూ.63 లక్షలతో 20 ఇ - ఆటో లు పంపిణీ చేయడం చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మిగిలిన అన్ని నియోజకవర్గాలకు పంపిణీ చేస్తామన్నారు. ఈ వాహనాల ద్వారా గ్రామాల్లో చెత్త సేకరణ, తొలగింపు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇవి కాక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా మరిన్ని వాహనాల ను సమకూర్చే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ అముద, చూడా ఛైర్మన్ కఠారి హేమలత, డిపిఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమా?

బి. కె. ఎం. యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

విశాలాంధ్ర-గూడూరు: ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమా? అని బి.కె.ఎం.యు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్ ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ, బి. కె.ఎం. యు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బి.కె.ఎం.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవన విధానాన్ని పూర్తిగా మార్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్గర్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వేతనాలు నూరుశాతం కేంద్రమే భరించేదని, ఇప్పుడు రాష్ట్రాలపై 40 శాతం భారం వేయడం వల్ల రాష్ట్రానికి సుమారు రూ.5 వేల కోట్ల నిధులు తగ్గి, పథకం అటకెక్కే ప్రమాదం ఉందన్నారు. సాంకేతికత పేరుతో వేధింపులు, ఆధార్ అనుసంధానం, ఇకెవైసి వంటి కారణాలతో రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల మంది కార్మికుల పేర్లను తొలగించడం దారుణమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి పేరు యధావిధిగా కొనసాగించాలన్నారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ , ఏ. ఐ.టి. యు.సి నియోజక వర్గ అధ్యక్షులు సి వి.ఆర్ కుమార్ మాట్లాడుతూ నెట్వర్క్ సమస్య వల్ల వేతనాలు రాక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును వ్యతిరేకించాలని ఎంపిలను కోరారు.. పేదల బతుకుదెరువును దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బి.కె.ఎం.యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసా మూర్తి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేయడం బాధాకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను విరమించుకోవాలని, అదేవిధంగా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏ.ఐ.టి.యు.సి నియోజవర్గ కార్యదర్శి నారాయణ, ఏ.ఐ.వై.ఎఫ్ నాయకులు సునీల్, కన్నా సుబ్రమణ్యం, రఘురామయ్య, యాకోబు, సంపూర్ణమ్మ, నరసింహులు శెట్టి, యశ్వంత్, షణ్ముఖ సుందరం తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడా మేలుకో.. నీ హక్కులు తెలుసుకో..

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం,ఐరాల మండలంలోని అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రవిమాట్లాడుతూ సోమవారం సాయంత్రం మూడు గంటలకు జాతీయ వినియోగదారుల వార్షికోత్సవ లు కార్యక్రమంకాణిపాకం అగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు స్వచ్ఛంద సంస్థ రవివినియోగదారుడా మేలుకో నీ హక్కులు కాపాడుకో అనే నినాదాలతోఅగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ చేసి విద్యార్థులకు అవగాహన కల్పి కల్పించి మీ హక్కులు మీరు కాపాడుకోవాలి అని విద్యార్థిని విద్యార్థులకు ఆయన తెలియ చేశారు జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా వినియోగదారుడా మేలుకో నీ హక్కులను తెలుసుకో" అనే నినాదంతో కాణిపాకం అగరంపల్లి హై స్కూల్ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహనా సమావేశంలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. నాణ్యమైన వస్తువులు, సేవలను పరిశీలించే దృష్టి కలిగి, అవగాహనతో కూడిన విజ్ఞానవంతులైన వినియోగదారులుగా అలాగే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం, వినియోగదారుల ఫోరంలో కేసులు దాఖలు చేయడం వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారుల సంక్షేమం, పరిరక్షణ, హక్కులపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలలో ప్రతి విద్యార్థి భాగస్వాములయ్యేలా పాఠశాల యాజమాన్యం కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు వినియోగ విజ్ఞానం, నైపుణ్యాలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. తూనికలు, కొలతలలో జరిగే మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫేక్ లీడర్ల మాటలు జనం విశ్వసించరు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఫేక్ లీడర్ల మాటలు జనం విశ్వసించరని.. కేసీఆర్, జగన్ ఇద్దరు ఫేక్ నాయకలు అని టీడీపీ బీసీ విభాగం నాయకులు ఆరోపించారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మరుగున పడిన తన రాజకీయ జీవితాన్ని పునరుజ్జీవనం చేసుకోవడానికి ప్రతీసారీ అటు చంద్రబాబుని, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దోషులుగా చిత్రీకరించి, తెలంగాణా పౌర సమాజాన్ని మోసగించి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న ఫాం హౌస్ పులకేశి కెసిఆర్ ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబు అంటే కేవలం ఒక పేరు కాదు.. ఒక బ్రాండ్ అని, ఆయనపై విమర్శలు చేసే ముందు మీ స్థాయి ఏంటో లక్ష సార్లు ఆలోచించుకోవాలని హితవు పలికారు. కెసిఆర్ చెప్పినట్లు ఫేక్ ఒప్పందాలు చేసుకున్నది, ఆయన శిష్యుడు జగన్ పెట్టిన ఇన్వెస్టర్ సమిట్లో అని తెలిపారు. చాలా రోజుల తరువాత నిద్ర లోంచి బయటకు వచ్చి క్రియాశీలకం అయ్యారు కదా, మర్చిపోయి ఉంటారని ఎద్దేవా చేశారు. 2023 మర్చిలో మీ ఫేక్ జగన్, ఒక ఫేక్ ఇన్వెస్టర్ సమ్మిట్ పెట్టాడని. 13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అందరితో ఫోటోలు దిగాడు. ఆ ఒప్పందాలు చేసుకున్నది విశాఖ బీచ్ రోడ్డులో ఉన్న చైనీస్ నూడిల్స్ బండి వాడితో, ఆ వీడియో విపరీతంగా వైరల్ అయిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని, ఇక చంద్రబాబు తెచ్చిన పెట్టుబడుల గురించి ఫాం హౌస్ లో ఉన్న మీకు, బెంగుళూరు ప్యాలెస్ లో ఉన్న మీ శిష్యుడుకి తప్ప, ప్రపంచం మొత్తం కనిపిస్తున్నాయని, ఒకసారి కళ్ళకు వైద్యం చేయించుకొని చూడటానికి ప్రయత్నించమని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిస్సల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకులు మణి, గాజుల భగత్, గంగానపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి నీ ఎండగట్టాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

సిపిఐ జిల్లా కార్యదర్శి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర-తిరుపతి: బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతాలు ప్రాంతాలు భాషలు ఆహారం అలవాట్లు మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి సిపిఐ కార్యాలయంలో తిరుపతి నగర సమితి సమావేశం రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పి మురళి మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య ఘర్షణ లు పెట్టడం తో పాటు పాకిస్తాన్ ని ఎన్నికల్లో వాడుకున్న గత ఎన్నికల్లో బీజేపీ కి సీట్లు గణనీయం గా తగ్గిపోయింది . ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా మోడీ అమలు చేయలేదు అన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కారం చేయడం లేదు అన్నారు. కార్మిక చట్టాలను హరించి వేస్తున్నారు అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ కొత్తగా ఒక్క వృద్యోగం ఇవ్వలేదు అన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక అవినీతి విపరీతంగా పెరిగిందని అన్నారు. ప్రభుత్వ భూములు బడా బాబులకు ధార దత్తం చేస్తున్నారు అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగిస్తున్నారు అన్నారు. దేశంలో రాష్ట్రం లో కూటమి ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజల లోకి తీసుకెళ్లాలి అన్నారు. అన్ని రకాల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించాలి అన్నారు. అదే సందర్భంలో పార్టీని గ్రామీణ స్థాయి నుండి బలోపేతం చేయాలి అని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాల తో పాటు ప్రభుత్వ తీరును ఎండ గట్టాలీ అంటే కమ్యూనిస్టులు చట్ట సభలలో అడుగు పెట్టాలి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి అన్నారు. పార్టీ చేస్తున్న పోరాటాలను ప్రజల లోకి తీసుకెళ్లాలి అన్నారు. ఈ సమావేశం లో సిపిఐ నగర్ కార్యదర్శి జె విశ్వనాథ్ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి చలపతి ఉదయ్ కుమార్ పద్మనాభం రెడ్డి కృష్ణ మహిళా సంఘం విజయ సురేష్ శీను తదితరులు పాల్గొన్నారు.

ధ్రువన్ చేతుల మీదుగా వృద్ధ ఆశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజవర్గం ఐరాల మండలం, లోని పోలకల గ్రామ పంచాయతి గుడి పల్లి లోని పి. అస్వామి రెండవ వర్ధంతి సందర్భంగా తన మనవడు ధ్రువన్, తమ్ముడు బాలకృష్ణ చేతుల మీదుగా వృద్ధ ఆశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ఐరాల మండలంలో గుడిపల్లి గ్రామానికి చెందిన ఆస్వామి రెండవ వర్ధంతి సందర్భంగా తాళంబెడువారి పల్లె గ్రామం నందు గల అనాథ అనాథాశ్రమంలో అనాథలుగా నివసిస్తున్న వంటి వృద్ధులకు ధ్రువన్ చేతుల మీదగా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాత రాధాకృష్ణ యాదవ్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-కార్వేటి నగరం: దాత వై రాధాకృష్ణ యాదవ్ సేవలు అభినందనీయమని డి ఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదముని రెడ్డి, చంగల్ రాజు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయస్థాయిలోకి ఎదగడం చాలా సంతోషకరమన్నారు. బియ్యం పురం విద్యార్థులు నలుగురు టెన్నిస్ వాలీబాల్ లో జాతీయస్థాయిలో క్రీడలు ఆడటానికి వెళ్లేందుకు పూర్వపు విద్యార్థి, మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి డైరెక్టర్ వై రాధాకృష్ణ యాదవ్ ఆంధ్ర చేత కలెక్ట్ చేసి 17500 చండీగర్ కి వెళ్లడానికి విద్యార్థులకు ఆ పాఠశాల హత్యం నాదముని రెడ్డి దగ్గర అందించారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి మండల స్థాయిలో ఫస్ట్, జిల్లా స్థాయిలో ఫస్ట్, రాష్ట్రస్థాయిలో ఎదిగి, జాతీయస్థాయిలో రావడం గొప్ప విషయమని రాధాకృష్ణ యాదవ్ విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా పదవ తరగతిలో మండలానికి మొదటి రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థులకు 10,000 ఐదువేల రూపాయలు చొప్పున బహుమానము అందిస్తానన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే 100% సాధించవచ్చు అన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన ఎగ్జిబిషన్ చక్కగా ఉండడం పై సంతృప్తి వ్యక్తం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.